# పాలిచ్చే గేదెలూ - ఫీజులు కట్టే పిల్లలూ !

ఒకరోజు పిల్లలు స్కూళ్ళ కెళ్ళేవేళ రంగు రంగుల యూనిఫారాల్లో నడకలు నేర్చిన పూల తీగెల్లా, తెల్లగా తోమిన దేవుడి వెండి విగ్రహాల్లాగా కళకళ్ళాడుతూ గుంపుల గుంపులుగా వెడుతున్నారు.

పొట్టి మాత్రం కిలుంపట్టిన లక్ష్మి విగ్రహంలా దిగులుగా కూర్చున్నాడు ఇంటి ముందు. అంతలో చిట్టి పాతిక్కిలోల బియ్యం మూటలాంటి పుస్తకాల సంచీ భుజానవేసుకుని మిత్రుడ్ని కలుపు కోటానికొచ్చాడు.

" నే స్కూలుకి రాన్రా " అన్నాడు పొట్టి దిగులుగా.

" ఎందుని ? "

" మానాన్న ఫీజుకట్లేదుగా – అందుకని "

" ఎందుకట్లేదు "

" ఏమోమరి – రేపు , చూద్దాంలే అన్నార్రా "

చిట్టి సంచీని క్రిందికి దించి తనూ మిత్రుడి ప్రక్కనే కూలబడ్డాడు. ఫీజులు కట్కపోతే స్కూల్లోకి రానివ్వరు. అదో వ్యాపారం. నష్టం తెలీని వ్యాపారం – ముక్కు పచ్చలారని ముద్దు కూనలే వాళ్ళ పెట్టుబడి. వాళ్ళక్కావాలసింది ఫీజు – ఇంట్లో పెద్దలు రేపు రేపని వాయిదాలు వేస్తుంటారు. ఈ దేవదానవ మధనానికి కవ్వాలు –పిల్లలు.

" చిట్టీ – నువ్వెళ్ళిరా – నే ఇంట్లోనే చదువుకుంటా " అన్నాడు పొట్టి దిగులుగా.

చిట్టికి బాధగా వుంది. పొట్టి లేకుండా ఒక్కడూ స్కూలుకెళ్ళటం అతడికి తెలీని విషయం. కనీసం వూహించుకోని విషయం.

రెండు క్షణాలు ధీర్ఘంగా ఆలోచన చేసి, చిట్టి చివుక్కున లేచి నిలబడి,

" పొట్టీ – వెడదాం పదా " అన్నాడు ధైర్యగంఅ.

" అమ్మో నేరాన్రా – టీచరు కొడుతుంది "

" ఏం కాదు – టీచరికి నే ' షూ షూ ' మాంత్రం వేస్తాగా "

చిట్టి హామీతో ధైర్యం వచ్చి పొట్టి లేచి లోనికెళ్ళి పుస్తకాల మూటని తెచ్చు,కున్నాడు.

ఇద్దరూ స్కూలుకెళ్ళారు.

అప్పుడే క్లాసు మొదలైంది. పద్మావతి టీచరు సబ్జెక్టు లెక్కలు. కాని ఆవిడకి అవితప్ప అన్ని విద్యలు వచ్చును. అయినా లెక్కలే చెబుతుంది. మనిషి పిప్పళ్ళ బస్తాలాగా వుంటుంది.

అంచేత పెళ్ళికాలేదు – ఒకవేళ అయినా పిల్లలు పుడతారన్న గ్యారంటీ లేదు. ఆ విషయం పసిగట్టినప్పట్నించి – అందుకే ఆవిడకిపిల్లలంటే కోపం.

" వచ్చారా – తోడుదొంగలు – రోజూ ఆలస్యమే– పోయి కూర్చోండి "

ఇద్దరూ వెళ్ళి ప్రక్క ప్రక్కల్నే కూర్చున్నారు.

టీచరు హాజరుపట్టీ వేసింది.

పొట్టికి భయంగావుంది. చిట్టివంక దీనంగా చూసేడు.

చిట్టి మరింక ఆలస్యం చెయ్యకుండా, మెరుపు తీగెలా లేచి నిల్చున్నాడు.

ఏదో చెప్పబోతున్న పద్మావతి ఆ ప్రయత్నాననికి స్వస్తి చెప్పి.

" ఏంకావాలి " అనడిగింది చిట్టిని.

చిట్టి బోల్డంత సిన్సియర్‌గా " ఓ లెక్క అర్ధ కాలేదు టీచర్. మా నాన్నగారిక్కూడా అర్ధం కాలేదు – మిమ్మల్నడగమన్నారు. " అన్నాడు.

ఏం లెక్కది " ఇలా పట్రా " అంది గంభీరంగా.

చిట్టి దగ్గరగా వెళ్ళాడు. పుస్తకాన్నందించాడు . భక్తిగా చేతుల కట్టుకు నిల్చున్నాడు.

ఆవిడ లెక్కచదివింది. మళ్ళీ చదివింది. మళ్ళీ మళ్ళీ చదివింది. మొహం ఎర్రబడిందిగాని లెక్క బోధపడింది కాదు.

కాలము – పని – చాప్టరు.

" నువ్వెళ్ళి కూర్చో నేచెబుతా " నంది.

చిట్టితిరిగొచ్చి తన చోట్ల కూర్చున్నాడు.

పొట్టి కిదంతా ఆశ్చర్యంగా వుంది.

పద్మావతి టీచరు కాగితంపైన ఏవేవో అంకెలేస్తోంది. మళ్ళీ వెంటనే కొట్టి పారేస్తోంది. వొళ్ళు చెమట్లు పడుతున్నాయ్.

అంతలో కాలం అయిపోయింది. పనిమాత్రం కాలేదు. చిట్టితో " రేపు చూద్దాం " అని పుస్తకాన్ని బల్లపైనే వదిలి వేగంగా వెళ్ళిపోయింది.

పొట్టికి ప్రాణం వచ్చింది. ఈ రోజుకి గండం గడిచింది.

చిట్టి గర్వంగా చూసేడు " చూసేవా నా ప్రతాపం " అన్నట్లుగా

" చిట్టి – ఆ లెక్క టీచరుకి తెలీదని నీకెలా తెల్సురా " అనడిగాడు పొట్టి.

చిట్టి చిన్నగా నవ్వి " ఓస్ – ఆ లెక్క మానాన్నారికి కూడా తెలీదు " అన్నాడు.

" మరి అంతకష్టమైన లెక్క మన పుస్తకంలో కెలావచ్చిందిరా " అన్నాడు మళ్ళీ.

" ఆ విషయం ఎవ్వరికీ తెలీదు " అన్నాడు.

అంతలో ఇంగ్లీషు టీచరు తెలుగుపాటవాడుకుంటూ రావటం చూసి, చిట్టి పొట్టి సర్దుక్కూర్చున్నారు – బుద్ధిమంతుల్లాగా.

------- అయ్యిపోయింది -------